ఈనాడు మహబూబ్‌నగర్
గురువారం సెప్టెంబరు 26, 2024
5

రెండు నెలలకోసారి ప్రాజెక్టులపై సమీక్ష

పాలమూరు సాగునీటి పథకాలకు ప్రాధాన్యం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఉదండాపూర్ జలాశయం వద్ద బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శంకర్

ఈనాడు, మహబూబ్‌నగర్-న్యూస్‌టుడే, నాగర్‌కర్నూల్: పాలమూరు ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నామని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎత్తిపోతల పథకాల పరిధిలో ఎక్కడెక్కడ నిధులు మంజూరు చేయాలో నివేదికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రెండు నెలలకోసారి పాలమూరు ప్రాజెక్టులపై సమీక్షలు చేపడతామన్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాజెక్టులను బుధవారం ఆయన మంత్రి జూపల్లి, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సందర్శించారు. ఉత్తమ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఇక్కడి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ భూసేకరణ సమస్యలతో పనులు ఆలస్యం అవుతున్నాయని గుర్తించామన్నారు. దీనిపై గురువారం లోగా సమగ్ర సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఉదండాపూర్‌లో భూ సేకరణ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రావాల్సిన నిధులు ఆరు నెలల్లో చెల్లిస్తామన్నారు. గద్వాల నియోజకవర్గంలో 20 టీఎంసీల నీరు నిల్వ చేసేలా జలాశయాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. నార్లాపూర్ వద్ద పెండింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. జలాశయాల సందర్శన వద్ద అక్కడి సమస్యల్ని ప్రస్తావిస్తూ పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ పథకాల ఉద్దేశం, వాటి పూర్తి వివరాలపై ప్రాజెక్టు అధికారులను ప్రశ్నించగా కొన్ని చోట్ల అధికారులు తడబాటుకు గురయ్యారు. స్థానిక ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని ఈ పథకాలను వివరించారు.

వన్‌టైం సెటిల్‌మెంట్ చేయాలంటూ ఆందోళన.. : ఉదండాపూర్ జలాశయం పర్యటన ముగించుకుని వెళ్తుండగా ముంపు గ్రామాలకు చెందిన కొందరు అడ్డుకునే ప్రయత్నం చేశారు. తమకు వన్‌టైం సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే రూ.25 లక్షలు ఇస్తామని చెప్పి.. రాత్రికి రాత్రి రూ.16 లక్షలే ఖాతాలో ఎలా జమ చేస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, తమకు న్యాయం జరగకుంటే జలాశయం పనులను అడ్డుకుంటామని తెలిపారు. ఓ దశలో తోపులాట జరిగింది. పోలీసులు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ మల్లు రవి, దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, స్పెషల్ చీఫ్‌సెక్రటరీ రామకృష్ణరావు, ఈఎన్‌సీ అనిల్, కలెక్టర్లు సంతోష్, విజయేందిర బోయి, నీటి పారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.

20 శాతం కూడా చేయలేదు: జూపల్లి

సమీక్షలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ భారాసకు చెందిన మాజీ మంత్రి ఒకరు వారి హయాంలో 90 శాతం పనులు పూర్తి చేసినట్లుగా చెబుతున్నారని, ఇది పూర్తిగా అవాస్తవమన్నారు. పాలమూరు జిల్లాలో కుర్చీ వేసుకుని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని కేసీఆర్ చెప్పారన్నారు. ఇప్పటికీ 20 శాతం పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. కాలువలు పూర్తి కాకుండా ఆయకట్టుకు నీరెలా ఇస్తారని ప్రశ్నించారు. నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదన్నారు. సక్రమంగా పని చేయకపోవడం వల్లే ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే స్థానాలకు భారాస రెండు సీట్లకే పరిమితమైందన్నారు.

సమస్యలు వివరించిన ఎమ్మెల్యేలు..: సమీక్షలో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ నార్లాపూర్, ఏదుల మధ్యలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని జలాశయాల వద్ద ఒక్కో పంపునైనా సిద్ధం చేసి నీరు ఎత్తిపోసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

● ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాల్లో తక్కువ వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉదండాపూర్.. ప్రాజెక్టుకు గుండెకాయలాంటిదన్నారు. ● మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో 8 గ్రామాల ప్రజలకు నీటి ఊటతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ గ్రామాల ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ కింద పరిహారం ఇప్పించాలన్నారు.

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కేఎల్ఐ కాలువ 10 చోట్ల తెగిపోయి పంట పొలాలు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. ● ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట ఎత్తిపోతల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో శంకుస్థాపన చేయించాలన్నారు. కేఎల్ఐ 29 ప్యాకేజీలో వంగూరు మండలంలోని 8 గ్రామాలకు నీళ్లు ఇవ్వాలని కోరారు.

● నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ వట్టెం జలాశయం కింద డిస్ట్రిబ్యూటరీ కాలువలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయకట్టును పెంచాలని కోరారు. ● అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ నెట్టెంపాడు కింద 99వ ప్యాకేజీలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు.

● దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడి మాట్లాడుతూ హాజిలాపూర్, చౌదరపల్లి ఎత్తిపోతల పనులను చేపట్టాలని కోరారు.



నాగర్‌కర్నూల్: సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మేఘారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, నారాయణరెడ్డి, వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, విజయుడు, మధుసూదన్‌రెడ్డి

జూరాలకు పెరుగుతున్న వరద

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద పెరుగుతోంది. జలాశయంలోకి బుధవారం సాయంత్రానికి 71 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. 7 గేట్లు, జల విద్యుదుత్పత్తి ద్వారా 88 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని జూరాలకు వరద మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో దిగువకు నీటి విడుదల పెంచినట్లు అధికారులు తెలిపారు. అటు కర్ణాటక ప్రాజెక్టులకు సైతం వరద స్వల్పంగా పెరిగినట్లు సమాచారం.

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు

ఆగస్టు 16న జిల్లా కేంద్రంలోని పిస్తా హౌస్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో హన్వాడ మండలం వేపూర్ గ్రామానికి చెందిన యాదయ్య(45) వంట కార్మికుడు రహదారి దాటుతుండగా టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. వంట వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోంది.



దేవరకద్ర సమీపంలో రహదారిపై ప్రమాదకరంగా వాహనాలు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: కోదాడ-రాయచూర్ జాతీయ రహదారి 167 అత్యంత ప్రమాదకరంగా మారింది. నాలుగు వరసల రహదారి కొన్ని ప్రాంతాల్లో ఉండగా.. రెండు వరసల రహదారిగా మరి కొన్ని ప్రాంతాల్లో ఉంది. ఎక్కడైతే రహదారికి మధ్యన విభాగిణులు లేవో ఆ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గ్రామీణా ఠాణా కింద ఉన్న ఈ జాతీయ రహదారి రూరల్ పరిధిలో రెండు వరసల రహదారి మాత్రమే ఉంది. రహదారి సమాంతరంగా ఉండటం, గుంతలు లేకుండా ప్రయాణానికి అనువుగా ఉండటం, వేగ నియంత్రికలు, ట్రాఫిక్ సూచికలు లేకపోవడంతో వాహనదారులు ఇష్టం వచ్చినట్లు నడుపుతున్నారు. వాహనాలు అదుపుతప్పి అనర్థాలకు దారి తీస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఈ రహదారిపై 76 రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసులు అధికారికంగా నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో 40 మంది అమాయకులు మరణించగా, మరో 71 మంది క్షతగాత్రులయ్యారు. సమాచారం అందని సంఘటనలు అనేకం ఉన్నాయి.

ప్రత్యేక దృష్టి పెట్టాం..

ప్రమాదాలను నివారించడానికి కృషి చేస్తున్నాం. వారం క్రితం కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలపై కొన్ని సంయుక్త శాఖలతో సమావేశం ఏర్పాటు చేశారు. అందులో నిర్ణయించిన దాని ప్రకారమే 167వ జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాం.
- వెంకటేశ్వర్లు, డీఎస్పీ, మహబూబ్‌నగర్

9 చోట్ల బ్లాక్ స్పాట్లు..

కోదాడ-రాయచూర్ 167వ జాతీయ రహదారి మహబూబ్‌నగర్ మండల పరిధిలో 35 కి.మీ మేర విస్తరించి ఉంది. నిత్యం ఈ రహదారి గుండా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రమాదాలను నివారించడానికి ఈ నెల 13వ తేదీన పోలీస్‌శాఖ, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలకు సంబంధించిన అధికారులు బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ఆ ప్రాంతాల్లో రబ్బర్ స్ట్రిప్స్ ఏర్పాటు, సూచికలు, ట్రాఫిక్ చిహ్నాలు తదితర వాటిని ఏర్పాటు చేయాలని నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. గ్రామీణా ఠాణా పరిధిలో మయూరి పార్కు మూల మలుపు, పిస్తాహౌస్, బండమీదిపల్లి, ధర్మాపూర్, కోడూర్ స్టేజీ, ఓబ్లాయిపల్లి స్టేజీ, ఓబ్లాయిపల్లి ప్రాథమిక పాఠశాల, మన్యంకొండ, కోటకదిర స్టేజీ తదితర ప్రాంతాలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని నిర్ధారించారు.

ఉల్లి క్వింటా రూ.5,600

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : రైతులు పండించిన ఉల్లిని విక్రయించేందుకు దేవరకద్ర మార్కెట్ యార్డుకు బుధవారం తీసుకువచ్చారు. ఉల్లి 15 క్వింటాళ్లు రాగా.. గరిష్ఠంగా రూ.5,600 ధర రాగా.. కనిష్ఠంగా రూ.4,100 వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి జయశ్రీ తెలిపారు. ఉల్లి ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రధాన న్యాయస్థానంలో బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అలా చేయడం వల్ల ఎలాంటి వ్యాధులు రావని గుర్తు చేశారు. వర్షం నీటిని నిల్వ లేకుండా ఇంటి పరిసరాలు, ఇతర ప్రాంతాల్లో చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జిలు కల్యాణ్ చక్రవర్తి, రాచపూడి శ్రీదేవి, డి.ఇందిర, నిహారిక, వివిధ కోర్టుల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



పరిసరాలను శుభ్రం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి, న్యాయమూర్తులు

తీరంలో భూమాయ



కృష్ణ మండలం ముడుమాల్‌దొడ్డి శివారులో సర్వే నెం.45లో ప్రభుత్వ భూమి

కృష్ణా, మాగనూరు మండలాల్లో గతంలో విడతలవారీగా బడుగువర్గాలకు 2140 ఎకరాల భూమి ఎసైన్‌మెంట్ కమిటీ ద్వారా కేటాయించారు. పట్టాలిచ్చారు. కొందరికి పాసు పుస్తకాలున్నాయి. కానీ భూమి ఎక్కడుందో హద్దులేమిటో ఇప్పటికీ తెలియదు. చేతులు మారిందేమోనన్న అనుమానం రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

న్యూస్‌టుడే, కృష్ణా

గతంలో నిరుపేద రైతులకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా మంజూరుచేసిన భూములు అధికారుల సంతకాలకే పరిమితమయ్యాయి. ఒక్కొక్క రైతుకు అప్పట్లో మూడు నుంచి ఐదెకరాల భూమి కేటాయించి పట్టాలు ఇచ్చారు. చాలామంది రైతులకు ఇప్పటి వరకూ తమ పేరిట ఉన్న భూమి ఎక్కడన్నది చూపించలేదు. గతంలో పట్టాలు తీసుకున్న వారిలో కొందరు కాస్తులో ఉన్నారు. ధరణి వచ్చాక వారి పేరిట ఉన్న పట్టాలు నిలిపి వేశారు. వారికి అందాల్సిన రైతు బంధు నిలిపివేశారు. వారంతా ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మాగనూరు, నేరేడ్‌గం, ఆలంపల్లి, అడవిఖానాపూర్, ముడుమాల్, వడ్వాట్, అయినాపూర్ గ్రామాలలో అసైన్‌మెంట్ ద్వారా ఇచ్చిన భూముల వివరాలు మొత్తం గందరగోళంగా ఉన్నాయి. సరిదిద్దాల్సిన అధికారులు సర్వేయర్లపైకి నెపంనెట్టి జారుకుంటున్నారు. వందల ఎకరాల అసైన్‌మెంట్ భూమి ప్రశ్నార్థకంగా మారింది. ఆలంపల్లి శివారులోని 302 ,305, 306 సర్వే నంబర్లలో అప్పటి రైతుల పేర్లు ఇప్పుడు లేవు. వాటిపై విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఏళ్లకు ఏళ్లుగా సమస్య : 1972 నుంచి 2006 వరకు అసైన్‌మెంట్ భూ పంపిణీ జరిగింది. నేటి వరకూ కొందరు మాత్రమే లబ్ధి పొందారు. చాలా మంది పేర్లు అసైన్‌మెంట్ కమిటీలో ఉన్నా ఇప్పుడు వారి పేర్లపై భూములు లేవు. ఒకటీ అరా తప్ప మిగతావి అన్యాక్రాంతమైపోయాయి. కృష్ణా తీరంలో బడుగువర్గాలకు ఇచ్చిన భూములు చాలావరకు వేరే వర్గాల పేరుపై రిజిస్ట్రేషన్ కావడంలో మతలబు ఏమిటో అర్థం కావడం లేదు.

అర్జీ ఇస్తే పక్కకే : అసైన్‌మెంట్ భూముల విషయంలో వస్తున్న అర్జీలను సర్వే పేరుతో పక్కకు పెడుతున్నారు. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత మొత్తం అసైన్డ్ భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి వివరాలు బయటకు వెల్లడించడం లేదు. పలు గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదులు చాలా వరకు బుట్ట దాఖలయ్యాయి. 'ప్రజావాణి'లో కలెక్టరుకు దరఖాస్తు చేసుకున్నా అదే పరిస్థితి ఉంది.


ఆదేశాల మేరకు నిషేధిత జాబితాలోకి...: గతంలో ప్రభుత్వ ఆదేశాల మేరకే నిషేధిత భూముల జాబితాలో చేర్చాం. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సంక్రమించిన భూములకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తాం. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయితే తదుపరి చర్యలు చేపడతాం.
- సురేశ్, తహసీల్దారు, మాగనూరు.



మా నాన్నకు ప్రభుత్వ భూమి ఐదెకరాలు సంక్రమించింది. ఇద్దరు అన్నదమ్ములం సమానంగా పంచుకుని సాగు చేసుకుంటున్నాం. భారాస హయాంలో పట్టాలు రద్దు చేశారు. నేటికీ అదే పొలంలో పంటలు వేసుకుంటున్నాం. మాకు అన్యాయం చేయవద్దు. **- సాధు నర్సప్ప, గురురావు లింగంపల్లి**



మూడు దశాబ్దాల క్రితం గుడేబల్లూర్ శివారులో భూమికి పట్టా పాసుపుస్తకం ఇచ్చారు. బ్యాంకులో రుణం తీసుకున్నాను. రైతుబంధు వచ్చింది. మా భూమి ఎక్కడుందో అడిగితే మాత్రం చెప్పడం లేదు. **- వంద్రపోళ్ల శివప్ప, గుడేబల్లూర్**



నా భార్య ఉమాదేవి పేరిట అయినాపూర్ శివారులో మూడెకరాలు పట్టా ఇచ్చారు. నాటి నుంచి నేటి వరకూ మాకు ఇచ్చిన భూమి ఎక్కడ ఉందని అడిగితే అధికారులు సమాధానం చెప్పడం లేదు. పేరుకే పట్టాలు ఇచ్చి రికార్డులలో పేర్లు తారుమారు చేశారేమో అనుమానం కలుగుతోంది. **- గుండప్ప సవకార్, గుడెబల్లూర్.**

వైద్య విజ్ఞానం అందరికీ అవసరం



ప్లాస్టిక్ భూతంపై డీఎంహెచ్‌వో పద్మకు వివరిస్తున్న వైద్య విద్యార్థులు

పాలమూరు, న్యూస్‌టుడే: వైద్య విజ్ఞానం ప్రతి ఒక్కరికీ అవసరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.పద్మ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎనుగొండ ఎస్వీఎస్ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన మెడ్‌ఎక్స్‌పో సదస్సును ఆమె సందర్శించారు. అనంతరం పలు స్టాళ్లను పరిశీలించగా.. వైద్య విద్యార్థులు అనేక అంశాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ సదస్సు చాలా బాగుందని, కేవలం విద్యార్థులకే కాకుండా కుటుంబ సభ్యులు కూడా దీనిని సందర్శించాలని సూచించారు. ప్లాస్టిక్ భూతం, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన అంశాలు, విద్యుత్తు ఆదా, ఉత్పత్తి, వాటి వినియోగం, పోషకాహారం విలువలు, వ్యాయామం, ఇతర అంశాలు చక్కగా ఇందులో కళ్లకు కట్టేలా ప్రదర్శన చేస్తున్నారని పేర్కొన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.జోషి, తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల వారోత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వయోవృద్ధుల వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అక్టోబరు 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గోడపత్రికలను ఆవిష్కరించారు. గ్రామీణ స్థాయి నుంచి సీనియర్ సిటిజన్ చట్టం-2007 అమలుకు ఈచర్యలు తీసుకుంటామన్నారు. వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా సంక్షేమాధికారి జరీనా బేగం, సీనియర్ సిటిజన్లు జగపతిరావు, నాగేంద్ర స్వామి, తదితరులు పాల్గొన్నారు.

D.Pharmacy Spot Admission 2024-25
ESTD: 2003 SMT. SAROJINI RAMULAMMA COLLEGE OF PHARMACY
Seshadrinagar, Mahabubnagar. Ph: 08542-247420/248625
Approved by PCI New Delhi. Affiliated to SBTET, Hyderabad.
All Eligible Candidates Who have passed Intermediate with MPC/BiPC can attend D.Pharm Spot Admission held in College Campus on 27.09.2024 at 11.00 AM with Original Certificates & Required Fee.
Correspondent - 9848126763

St. MARY'S COLLEGE OF EDUCATION (B.Ed)
(Affiliated to Palamuru University)
Padmavathi Colony, Mahabubnagar-509001
B.Ed Admissions Under Management Quota ("B" Category 25%)
Applications are invited From the eligible Candidates for Admissions into B.Ed Course for the academic Year 2024-2025
1) Social Studies-09, 2) Mathematics-06,
3) Bio-Science-05, 4) Physical Science-04, 5) English-01
Ph: 9000624135, 9966414566 Sd/- SECRETARY

చట్టాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

పాలమూరు, న్యూస్‌టుడే: చట్టాలను సద్వినియోగం చేసుకుని తమ హక్కులను సాధించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంధుల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చట్టం పరిధిలో నడుచుకుంటే ఎలాంటి సమస్యలు రావని చెప్పారు. దివ్యాంగులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వాటిని అధిగమించడానికి తమ హక్కులు, చట్టాలు, తదితర వాటి గురించి పూర్తిగా తెలిసి ఉండాలని సూచించారు. ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా తాము చేస్తామని వారికి హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

కోయిలసాగర్ రెండు గేట్లు ఎత్తివేత



దిగువకు విడుదలవుతున్న నీరు

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : కోయిలసాగర్ జలాశయం నుంచి రెండు గేట్లను ఎత్తి 1,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. వాగు పరిసరాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గేట్లు ఎత్తడంతో పర్యాటకుల సందడి నెలకొంది.


విద్యాలయాలకు నిర్వహణ నిధులు

ఉమ్మడి జిల్లాకు రూ. 9.53 కోట్లు ● తొలి విడత 50 శాతం నిధులు విడుదల

పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా నిర్వహణ నిధులు విడుదల కాకపోవడంతో హెచ్‌ఎంలు సొంతంగా ఖర్చు చేసేందుకు ఇబ్బంది పడ్డారు. మొదటి విడతగా 50 శాతం నిధులు విడుదల కావడంతో కష్టాలు తీరనున్నాయి. ఇప్పటి వరకు హెచ్‌ఎంలు సొంతంగా ఖర్చు చేసిన నిధులను ఏఏపీసీ కమిటీల తీర్మానంతో మినహాయించుకోవడానికి అవకాశం కల్పించారు. త్వరలో రెండో విడత మరో 50 శాతం నిధులు విడుదల చేయనుండటంతో పాఠశాలల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవడానికి వెసులుబాటు ఏర్పడింది.

- న్యూస్‌టుడే, అచ్చంపేట

సర్కారు బడుల్లో నిర్వహణ కోసం 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభమైన మూడు నెలల తరువాత ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కనీస అవసరాలైన సుద్ద ముక్కలు, రిజిస్టర్లు, హాజరు పట్టికలు, స్టేషనరీ, చార్టులు, పరీక్షల నిర్వహణ, కంప్యూటర్ సామగ్రి, శౌచాలయాల నిర్వహణ, తాగునీరు, మరమ్మతు పనులు, ఇంటర్నెట్, ప్రయోగశాలల పరికరాలు, రసాయన సామగ్రి, జాతీయ పండుగల నిర్వహణ, డస్టర్లు, చీపుర్లు, బకెట్లు, బిందెలు, సబ్బులు తదితర వస్తువులను కొనుగోలు చేసేందుకు ఏటా సర్కారు నిధులు కేటాయిస్తోంది. గతంలో ఈ నిధుల నుంచే విద్యుత్తు బిల్లులు కూడా చెల్లించేవారు. ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉచిత విద్యుత్తును అందిస్తుండటంతో కొంత భారం తగ్గింది. నిధుల విడుదలలో జాప్యంతో హెచ్‌ఎంలు సొంత నిధులు పెట్టి అవసరమైన వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో వెసులుబాటు కలగనుంది. పాఠశాలల నిర్వహణ కోసం ఉమ్మడి జిల్లాలోని 3,032 పాఠశాలలకు మొత్తం రూ.9.53 కోట్లు మంజూరు చేసింది. మొదటి విడతగా అందులో 50 శాతం నిధులు రూ. 4.76 కోట్లు విడుదల చేశారు.



కొండనాగుల జడ్పీ ఉన్నత పాఠశాలలోని శౌచాలయాలు

● ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కేజీబీవీ, ఆదర్శ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు కేటాయించారు. ఈ నిధులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏఏపీసీ) తీర్మానంతో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది.
- డా.గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూల్

ఉమ్మడి జిల్లాకు నిధుల మంజూరు (రూ.లలో)

జిల్లా	పాఠశాలలు	మంజూరు	విడుదల
జోగులాంబ గద్వాల	447	1,75,80,000	87,90,000
మహబూబ్‌నగర్	795	2,33,35,000	1,16,67,500
నాగర్‌కర్నూల్	834	2,26,05,000	1,13,02,500
నారాయణపేట	460	1,68,75,000	84,37,500
వనపర్తి	496	1,49,50,000	74,75,000
మొత్తం	**3,032**	**9,53,45,000**	**4,76,72,500**

కేటాయింపు ఇలా..

విద్యార్థుల సంఖ్య	నిధులు (రూ.లలో)
1–30	10,000
31–100	25,000
101–250	50,000
251–1000	75,000
1000 పైగా	1,00,000



(c) eenadu

వట్టెం పంపుహౌస్‌లో తేలిన మోటార్లు



వట్టెం పంపుహౌస్ ఇదే..

నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, న్యూస్‌టుడే : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం జలాశయం వద్ద చేపట్టిన పంపుహౌస్‌లో మునిగిన మోటార్లు బుధవారం తేలాయి. ఈనెల 2న వచ్చిన భారీ వర్షాలకు శ్రీపురం, ఉయ్యాలవాడ, కుమ్మెర గ్రామాల వద్ద ఉన్న ఆడిట్ టన్నెళ్ల ద్వారా నీరు లోపలికి వెళ్లాయి. పంపుహౌస్‌లోని మోటార్లు పూర్తిగా మునిగిపోయాయి. 20 మీటర్ల వరకు నీరు నిల్వగా మారింది. శ్రీపురం నుంచి వట్టెం వద్ద ఉన్న పంపు హౌస్ వరకు ఉన్న టన్నెల్ పూర్తిగా నీటిలో ఉంది. మోటార్లు మునిగిన తర్వాత ఈ 4వ తేదీ నుంచి మోటార్ల

నీటి తిరిగి ఎత్తిపోత

ద్వారా నీటిని తోడివేసే పనులను చేపట్టారు. ముందుగా మోటార్లను బయటికి తీసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 40 మోటార్ల ద్వారా నిత్యం నీటిని తోడివేస్తున్నారు. వారం రోజులుగా సర్జిపుల్ నుంచి పంపుహౌస్‌లోకి నీళ్లు వెళ్లకుండా షట్టర్ల మూసివేత పనులు చేపట్టారు. ఆరుగురు గజ ఈతగాళ్లను పిలిపించి షట్టర్లలో నుంచి పంపుహౌస్‌లోకి నీళ్లు రాకుండా చర్యలు చేపట్టారు. బుధవారం మోటార్లు తేలాయి. 15 కిలో మీటర్ల పొడవునా ఉన్న టన్నెల్‌లో మాత్రం నీళ్లు అలాగే ఉన్నాయి. పంపుహౌస్‌లో ఉన్న నీటిని ఐదు హెచ్‌పీ మోటార్ల ద్వారా తోడివేశామని, మోటార్లకు మరమ్మతులు చేస్తున్నట్లు ఈఈ పార్థసారథి తెలిపారు.




మోటారు భాగాలు విడదీసి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

9 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం నుంచి వరద నీటి విడుదల కొనసాగుతున్న నేపథ్యంలో ఎగువ, దిగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి చేపట్టేందుకు జెన్‌కో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. గడచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 3.017, దిగువన నాలుగు యూనిట్ల ద్వారా 2.910 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం ఉత్పత్తి ఎగువన 193.074, దిగువన 167.034 మిలియన్ యూనిట్లకు చేరిందని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

అమ్మాయిలు తగ్గిపోతున్నారు..!





మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జన్మించిన నవజాత శిశువులు

పాలమూరు, న్యూస్‌టుడే

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మూడేళ్లలో నమోదైన జననాల రేటులో అబ్బాయిల కంటే అమ్మాయిల సంఖ్య తక్కువగా నమోదైంది. వీరిపై చిన్న చూపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పల్లెల్లో, తండాల్లో మగపిల్లలు పుట్టాలని కోరుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఇంటి బాధ్యతలు మోస్తాడని.. తల్లిదండ్రులకు ఆధారంగా ఉంటాడని.. వంశాన్ని నిలబెడతాడని.. కొందరు పాత పోకడలను పట్టుకుని వాటిని పాటిస్తున్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఆడపిల్లలపై వివక్ష కొనసాగించడం ఆందోళనను కలిగిస్తోంది. అబ్బాయిలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించి అమ్మాయిలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేవారున్నారు. ఇద్దరూ సమానమని అవగాహన కల్పిస్తున్నా మార్పు రావడం లేదు.

విచ్చలవిడిగా స్కానింగ్ కేంద్రాలు

భ్రూణ హత్యలు చేయడం నేరం. గుట్టుచప్పుడు కాకుండా గర్భవిచ్ఛిత్తి చేస్తున్నారు. మూడు నెలల క్రితం భూత్పూర్ సమీపంలో ఓ ఆర్ఎంపీ పర్యవేక్షణలో వివాహితకు గర్భవిచ్ఛిత్తి వైద్యం వికటించి ఆమె మృతి చెందిన విషయం తెలిసిందే. ఇలాంటి నేరాలు అప్పుడప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. వెలుగులోకి రానివి ఉమ్మడి జిల్లాలో చాలా ఉంటాయి. పట్టణాలు, మండల కేంద్రాల్లో స్కానింగ్ కేంద్రాలు విచ్చలవిడిగా ఏర్పాటయ్యాయి. ఇక్కడి వచ్చే గర్భిణుల పేర్లు నమోదు చేసుకొని, ఆధార్‌కార్డు వివరాలు రికార్డుల్లో రాయాలి. పూర్తి సమాచారం వారి వద్ద ఉండాలి. కొందరు స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు పేర్లు చేసుకుంటున్నారు. పుట్టబోయేది ఆడ లేదా మగ వివరాలు కూడా చెబుతున్నారు. ఈ కేంద్రాలపై వైద్య, ఆరోగ్య శాఖాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.



ఉమ్మడి జిల్లాలో నమోదైన బాలుర, బాలికల జననాల వివరాలు.. (అబ్బాయిలు / అమ్మాయిలు)

జిల్లా	2021-2022 అబ్బాయిలు	2021-2022 అమ్మాయిలు	2022-2023 అబ్బాయిలు	2022-2023 అమ్మాయిలు	2023-2024 అబ్బాయిలు	2023-2024 అమ్మాయిలు
మహబూబ్‌నగర్	8,099	7,577	7,958	7,406	7,617	6,979
నాగర్‌కర్నూల్	6,680	6,062	6,742	6,782	6,639	5,913
వనపర్తి	4,710	4,346	4,606	4,393	4,647	4,030
జోగులాంబ గద్వాల	5,007	4,732	4,984	4,625	4,773	4,268
నారాయణపేట	5,258	4,956	5,234	4,831	5,215	4,637

తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం



మా వద్దకు వచ్చే తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం. గర్భం దాల్చిన తరువాత మంచి ఆహారం తీసుకోవాలని చెబుతున్నాం. సమాజంలో అమ్మాయిలు.. అబ్బాయిలతో సమానమనే భావన తల్లిదండ్రుల్లో కలగాలి. సాధారణంగానే బాలికల శాతాన్ని పెంచాలి. లింగనిర్ధారణ పరీక్షలపై నియంత్రణ ఉండాలి. చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలి. అమ్మాయిలకు మంచి భవిష్యత్తు ఉంటుంది. వారి కోసం అనేక సంక్షేమ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి.

- డా.సంగీత షా, ప్రసూతి విభాగాధిపతి, మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నాం



సమాజంలో బాలికలు, బాలురు అనే తేడా లేకుండా ఉండటానికి వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఎక్కడ కూడా భ్రూణ హత్యలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తున్నాం. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన తరువాత ఎట్టి పరిస్థితుల్లో వాటి వివరాలు బహిర్గతం చేయరాదు. నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నాం.

- పద్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, మహబూబ్‌నగర్

అక్షరాలు.. ఆకలి తీర్చే ఔషధాలు



మాట్లాడుతున్న గేయ రచయిత అందెశ్రీ

పాన్‌గల్, న్యూస్‌టుడే : అక్షరాలు ఆకలి తీర్చే ఔషధం కావాలని గేయ రచయిత, లోక కవి అందెశ్రీ అన్నారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఆ పాఠశాల ఉపాధ్యాయుడు, పుస్తక సంపాదకుడు సి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఫ్లయింగ్‌బర్డ్స్' విద్యార్థుల కవితా సంకలనం పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి అందెశ్రీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనిషి ఎదుర్కొనే ఆకలి, ఆశ, కోరికలకు పరిష్కారం అక్షరమే అన్నారు. 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' అన్న గేయం తెలంగాణ ఉద్యమ సమయంలో, నేడు రాష్ట్ర గేయంగా మారినా దానిని నిలబెట్టింది, గుర్తింపునిచ్చింది, బతికించింది పిల్లలేనని గుర్తు చేశారు. తాను నిరక్షరాస్యుడైనా చందస్సు రాసి, ఎవరైనా ఎలాంటి పరిస్థితుల్లోనైనా దృఢంగా విశ్వసిస్తే ఎంతటి శిఖరాలకైనా చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థి దశలోనే ఇంత గొప్ప కవిత్వం రాసిన బాలలు రాబోయే రోజుల్లో తమ సాహితీ ప్రక్రియ ద్వారా సమాజంలో ఉన్నత మార్పులు తీసుకురావడానికి తమను తాము గొప్పగా మలుచుకోవాలని సూచించారు. చదువు లేని వ్యక్తి ఏదైనా తప్పు చేయాలంటే ఆలోచిస్తాడని, అదే చదువుకున్న వ్యక్తి ఆలోచించకుండా తప్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాలాన్ని అవసరాల కోసం వినియోగించుకోవాలని సూచించారు. అంతర్జాలం కంటే మన మేధస్సు ఎంతో గొప్పదని, అంతర్జాలం కారణంగా అన్ని మర్చిపోతున్నామని ఆందోళన చెందారు. కులమతాలను పక్కన బెట్టి బోధించాలని ఉపాధ్యాయులను సూచించారు. రాష్ట్ర మంత్రుల కార్యాలయాలకు తలదన్నే విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. పాఠశాల ఆవరణలో నీటి తడిలో కూర్చొని విద్యార్థులు కార్యక్రమం చూస్తుంటే ఆయన పైవిధంగా స్పందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు నరేందర్, మంజుల, ప్రజాకవి జనజ్వాల, గాయకుడు సత్తార్, ఎంపీడీవో గోవిందరావు, ఎంపీవో రఘురాములు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5 తరగతులు.. 12 మంది విద్యార్థులు



బుధవారం హాజరైన 8 మంది విద్యార్థులు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండలంలోని లక్ష్మీదేవమ్మపల్లి ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులే అభ్యసిస్తున్నారు. వీరిలో బుధవారం 8 మంది హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలకు 'న్యూస్‌టుడే' పాఠశాలను సందర్శించగా రెగ్యులర్ ఉపాధ్యాయుడికి బదులు చాకల్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రమేశ్ విధుల్లో ఉన్నారు. వివరాలు ఆరా తీయగా.. రెగ్యులర్ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్ బదిలీ అయ్యారని, ఆయన స్థానంలో కర్ణమయ్యకుంట తండాకు చెందిన ఓ ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై నియమించారని తెలిపారు. బుధవారం ఆయన సెలవులో ఉండటంతో తనను ఒకరోజు కోసం పాఠశాలకు పంపించారని పేర్కొన్నారు. గతంలో 30 మంది వరకు విద్యార్థులుండే ఈ పాఠశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరం కేవలం 12 మందికే పరిమితమయ్యారు. ఈ విషయమై మండల విద్యాధికారి శ్రీనివాసగౌడ్‌ను ప్రశ్నించగా తల్లిదండ్రులు పిల్లలను ఆంగ్ల మాధ్యమం కోసం పట్టణాలకు పంపడం వలన విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని, వారి సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

'పాలమూరు కరవుకు కాంగ్రెస్ పార్టీయే కారణం'

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : ఉమ్మడి పాలమూరును పడావు పెట్టిందే కాంగ్రెస్ పార్టీనని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలమూరులోని ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టి ఆంధ్ర, రాయలసీమ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసిందని పేర్కొన్నారు. పదేళ్లలో కేసీఆర్ తలపెట్టిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులపై వందల కేసులు వేయించి అడ్డుకున్న పాపం ఆ పార్టీదేనన్నారు. కృష్ణా నది నుంచి రోజూ 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు సముద్రం పాలవుతున్నా రిజర్వాయర్లు నింపుకోలేకపోవడం రాష్ట్ర ప్రభుత్వ చేతకాని తనమన్నారు. జూరాలపై భారం పడొద్దనే శ్రీశైలం బ్యాక్ వాటర్ కింద కేసీఆర్ 'పాలమూరు-రంగారెడ్డి' మొదలు పెట్టారని గుర్తు చేశారు. మంత్రుల పర్యటనతో పాలమూరుకు ఒరిగేదేమీ లేదని, ఇక్కడి రైతులకు మేలు చేయాలన్న ప్రణాళిక, చిత్తశుద్ధి లేదని ఎద్దేవా చేశారు. భారాసకు భయపడి మంత్రులు హడావిడిగా ప్రాజెక్టుల పర్యటనలు పెట్టుకున్నారని విమర్శించారు.

విద్యార్థులకు ఆరోగ్య ప్రశస్త

పిల్లల్లో శారీరక, మానసిక లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్



తుమ్మిళ్ల పాఠశాలలో ట్యాబ్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్: పాఠశాలలకు వస్తున్న విద్యార్థుల్లో చాలా మంది శారీరక, మానసిక వికలత్వంతో పాటు, కొందరు గుర్తించలేని లోపాలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. ఇలాంటి వారికి సంబంధించి ప్రభుత్వం వివరాలు సేకరించనుంది. ఈ మేరకు ఎన్‌సీఈఆర్టీ ప్రత్యేకంగా ప్రశస్త పేరుతో యాప్‌ను రూపొందించింది. ఉపాధ్యాయులే విద్యార్థులను పరిశీలించి వారికి సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంది. ఇలా నమోదు చేసిన వారిలో సమస్యలుంటే పిల్లలకు ఉన్నత స్థాయి వైద్యం అందేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందులో భాగంగానే 25, 26, 27 తేదీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులకు ఆర్పీలు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందిన వారంతా వారి పాఠశాలల్లోని పిల్లల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో : అయిదు జిల్లాల పరిధిలో మొత్తం 3,227 ప్రభుత్వ పాఠశాలలుండగా, 1,200కి పైగా ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 5.20 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరందరి వివరాలు ప్రశస్త యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, పేరు, సర్వీసు నంబర్, మెయిల్ ఐడీ, చరవాణి, యూడైస్ కోడ్‌తో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. తరువాత అందులో సూచించిన విధంగా వివరాలు నమోదు చేయాలి.

రెండు భాగాలుగా : ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయ్యాక ఈ కార్యక్రమం అమలు కానుంది. దీనిని రెండు భాగాలుగా విభజించారు. ప్రశస్త యాప్‌లో పొందుపరిచిన విధంగా ఉపాధ్యాయులు కొన్ని ప్రశ్నలను పిల్లలను అడిగి తెలుసుకోవాల్సి ఉంటుంది. మరికొన్ని వారే నిశితంగా పరిశీలించి నమోదు చేయాల్సి ఉంటుంది.

● పార్ట్-1 కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి అక్టోబరు 26 వరకు చేపట్టాలి. ఈ సమయంలో యాప్‌లో ఉన్న 64 రకాల ప్రశ్నలకు సమాధానాలు పొందుపరచాల్సి ఉంటుంది. బోధన సమయంలో ఆ విద్యార్థి సరిగా చూస్తున్నాడా? గమనిస్తున్నాడా? చదువుతున్నా? అవయవలోపం, వినికిడి లోపం, మాటలో తడబాటు, మానసిక వైకల్యం ఇలాంటివి గమనించి నమోదు చేయాలి.

● పార్ట్- 2 కార్యక్రమాన్ని అక్టోబరు 27 నుంచి నవంబరు 14 వరకు చేపట్టాల్సి ఉంటుంది. ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే ఉపాధ్యాయులు లోపం ఉన్న వారిని పరిశీలిస్తారు. లోపాన్ని గుర్తించి వైద్యులకు సిఫార్సు చేయాల్సి ఉంటుంది.



ప్రశస్త యాప్ ముఖచిత్రం

మెరుగైన వైద్యం అందేలా..

విద్యార్థులకు సంబంధించి శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు, అవయవ లోపం ఉన్న వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. పేదరికంతో తల్లిదండ్రులు వైద్యం చేయించలేని పరిస్థితులు అయిదు జిల్లాలలోని క్షేత్ర స్థాయిలో నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే నేరుగా విద్యార్థుల సమస్యలను తెలుసుకొని, ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోనుంది.

వంద శాతం నమోదయ్యేలా చూస్తాం



ప్రశస్త యాప్ ద్వారా విద్యార్థుల వివరాలన్నీ వందశాతం నమోదు చేసేలా చూస్తాం. ఇప్పటికే ఈ యాప్‌పై ఉపాధ్యాయులకు శిక్షణలు నిర్వహిస్తున్నాం. శిక్షణ ముగిసిన వెంటనే విద్యార్థులందరినీ సూక్ష్మంగా పరిశీలించి వారి లోపాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలు ఉన్నతాధికారులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారు.

-హంపయ్య, జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి, గద్వాల

భార్య వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య



సాయి

కందనూలు, న్యూస్‌టుడే : భార్య వేధింపులు తట్టుకోలేక భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. రెండో ఎస్సై రమాదేవి కథనం ప్రకారం.. పట్టణంలోని నాగనూల్ బీసీ కాలనీకి చెందిన సాయి (21)కి నెల రోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన యువతితో వివాహమైంది. ఆమె మొదటి నుంచి భర్తతో సన్నిహితంగా ఉండకుండా తరుచు వేధించింది. వేధింపులు తట్టుకోలేక మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు మృతదేహాన్ని పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. బుధవారం సాయి బావ శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురిపై పోక్సో కేసు నమోదు

ధరూర్, న్యూస్‌టుడే: కేటిదొడ్డి మండలం ఉమిత్యాల గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై పోక్సో చట్టం కింద బుధవారం కేసు నమోదైంది. డీఎస్పీ సత్యనారాయణ కథనం మేరకు.. ఉమిత్యాల గ్రామానికి చెందిన ఓ బాలిక వారం రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. బాలిక మృతికి లైంగిక వేధింపులే కారణమే ఆరోపణలు వచ్చాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేసిన పోలీసులు లైంగిక వేధింపుల వల్లనే ఆమె మృతిచెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. దీంతో అదే గ్రామానికి చెందిన జగదీశ్వర్‌రెడ్డి, జయచంద్ర, వీరేశ్‌లపై పోక్సో చట్టంతో పాటు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి వారిని బుధవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

ఆ ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్

కందనూలు, న్యూస్‌టుడే : బిజినేపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తన స్నేహితురాలితో కలిసి మే 15న నాగర్‌కర్నూల్ పట్టణంలోని నల్లవెల్లి ప్రధాన రహదారి పక్కన కారులో భోజనం చేస్తుండగా పట్టణంలోని ఠాణాలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ట్యాబ్‌లో ఫొటో తీసి బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేశాడు. అదే ఫొటోను బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహించిన రాంచందర్‌కు పంపడంతో అతను కూడా బాధితుడిని బెదిరించాడు. ఈ ఫొటో భార్య, భర్తల మధ్య కలహాలకు కారణమైంది. ఈ ఘటనపై ఈనెల 23న ఆరోపణలు రావడంతో పోలీసు ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి మంగళవారం జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు పూర్తి నివేదిక అందజేశారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న రాంచందర్, చిన్నను ఎస్పీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ కనకయ్య బుధవారం రాత్రి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో పోలీసు అదృశ్యం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : పాన్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామకృష్ణ ఆర్థిక ఇబ్బందులతో అదృశ్యమయ్యారని వనపర్తి పట్టణ ఎస్సై జయన్న తెలిపారు. వనపర్తి పీర్లగుట్టలోని పోలీస్‌క్వార్టర్స్‌లో కుటుంబసభ్యులతో నివాసం ఉంటున్నారని, మంగళవారం సాయంత్రం ఎస్కార్ట్ విధులకు వెళుతున్నానని భార్య మంజుతో చెప్పి ఇంటి నుంచి వెళ్లి పోయారు. బుధవారం ఉదయం ఆమె ద్విచక్ర వాహనంపై ఉన్న భర్త బ్యాగును చూశారు. అందులో ఉన్న చరవాణి తీసి మెసేజ్ చదివారు. 'సారీ.. మంజు క్షమించు శ్రీరంగాపూర్‌లో పని చేస్తున్న రాకేశ్ మోసం చేశాడని, జీవితాంతం ఉద్యోగం చేసిన అప్పులు తీరే పరిస్థితి కనిపించడం లేదని, రుణాలతో సుమారు రూ.కోటికి ష్యూరిటీ ఇచ్చానని, ఈఎంఐ కట్టే పరిస్థితిలో లేనని అందకు వెళ్లిపోతున్నాని సమాచారం ఇచ్చాడని' ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కానిస్టేబుల్ అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా బుధవారం తెల్లవారుజామున 3.40 గంటలకు ఆయన హైదరాబాద్ బస్సులో వెళ్లారు. బస్సు చోదకుడిని అడగగా ఎంజీబీఎస్‌లో ఉదయం 6.40 గంటలకు కానిస్టేబుల్ దిగినట్లు తెలిపారని ఎస్సై పేర్కొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

Urgent House for Sale Kumarwadi, Madina Masjid Rd. Nr. Old Govt. Hospital Mahabubnagar. Contact: 9885402646, 9392369047.

JOBS

Wanted Clerk cum Computer Operator (For Ladies) PALLAVI I.T.I - Nancherla Gate. MBNR Dist. Cell : 9441783400, 9440205969

నేహాషేన్ హాస్పిటల్స్ లో పని చేయుటకు ల్యాబ్ టెక్నీషన్ వెంటనే కావలెను, ఆకర్షణీయమైన జీతం, అనుభవం కల్గిఉండాలి మెట్టుగడ్డ మ.నగర్ సం: 9100628976

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. ✆ 7995365999.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book Your 5 Lines Classified Advertisement for
B&W Rs. 335/- Only
Colour Rs. 395/- Only
GST 5% Extra
For further details Contact : Mahabubnagar 8008709794

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell:8008709794
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell:8008001824


నైపుణ్యాల ప్రదర్శన



వేలి ముద్రలను తనిఖీ చేసే విధానాన్ని పరిశీలిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, చిత్రంలో ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీలు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో 2024 సంవత్సరానికి సంబంధించి శాఖాపరమైన నైపుణ్యాలను బుధవారం ప్రదర్శించారు. దీనికి జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ హాజరై పోలీసు ప్రతిభా పాటవాలను అంచనా వేశారు. మహబూబ్‌నగర్ పోలీస్ విధుల నిర్వహణ కార్యశాలను డీఐజీ ప్రారంభించి మాట్లాడారు. వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నారు. ఫోరెన్సిక్ సైన్స్, నేర పరిశోధన, క్రిమినల్ లా, రాత పరీక్ష, మౌఖిక పరీక్ష, చేతి వేలి ముద్రల సేకరణ, నేరం జరిగిన చోట ఫొటోగ్రఫీ తీసే విధానం, సంఘటన స్థలంలో పోలీసుల నేర శోధనతో పాటు వాహనాల తనిఖీలు, క్షేత్రస్థాయిలో పరిశోధన, గదుల్లో పరిశోధన, కంప్యూటర్‌లో సాంకేతిక పరిజ్ఞానం, పోలీసుల జాగిలాలతో నేరస్థుల గుర్తింపు, నేరం చేసిన తర్వాత నిందితుడు వెళ్లే రహదారి గుర్తింపు, తదితర వాటిపై పోటీలు నిర్వహించారు. ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీలు రాములు, సురేశ్‌కుమార్, డీఎస్పీ సుదర్శన్, సీఐ రాజేందర్ పాల్గొన్నారు.

కొత్త పద్ధతులతో బోధించండి



మాట్లాడుతున్న పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి

పాలమూరు, న్యూస్‌టుడే: మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు కూడా తమ బోధన పద్ధతులను మార్చుకోవాలని, కొత్తగా వస్తున్న నూతన పద్ధతులను అందిపుచ్చుకోవాలని పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి సూచించారు. బుధవారం పాలమూరు విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు అధ్యాపక బోధన పద్ధతులపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తొలిరోజు గ్రంథాలయ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశానికి రిజిస్ట్రార్ హాజరై మాట్లాడారు. బోధనా రంగంలో నిత్యం అనేక రకాల మార్పులు చోటు చేసుకుంటున్నాయని, వాటిలో అధ్యాపకులు తగిన శిక్షణ పొందాలన్నారు. వృక్షశాస్త్ర ఆచార్యులు డా.సుధాకర్‌రెడ్డి, ఛైర్మన్ డా.చంద్రకిరణ్, పరీక్షల నియంత్రణ అధికారి డా.రాజ్‌కుమార్, కన్వీనర్ జిమ్మి కాటన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

మహబూబ్‌నగర్: 9948145978 జడ్చర్ల: 8008573899
దేవరకద్ర: 9000031648 భూత్పూర్: 8008563143

సమస్య: పిల్లలమర్రి దారిలోని సత్యమన్న కాలనీలో పది రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. ఉన్న ఓ బోరు కూడా చెడిపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం.

- నాయక్, సత్యమన్న కాలనీ

సమాధానం: పరిశీలించి సరఫరాను పునరుద్ధరిస్తాం.

- హరికృష్ణ, ఏఈ

సమస్య: ప్రేమ్‌నగర్ 18వ వార్డు పోచమ్మ దేవాలయం సమీపంలో ఉన్న ఓ ఇంటి వారు మురుగు ఖాళీ స్థలంలో వదులుతుండటంతో దుర్వాసన వస్తోంది. - భాను, ప్రేమ్‌నగర్

సమాధానం: మురుగు నీటిని కాలువలో వదలాలి. రహదారులు, ఖాళీ స్థలాల్లో వదిలితే చర్యలు తీసుకుంటాం.

- రవీందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

- న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

తెరపై ఈనాడు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: శ్రీనివాస- **భలే ఉన్నాడే (ఉదయం ఆటలు) ఉత్సవం (రాత్రి ఆటలు),** బాలాజీ - **మత్తు వదలరా 2,** తిరుమల- **సరిపోదా శనివారం** వెంకటేశ్వర- **గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (తెలుగు),** వెంకటాద్రి- **35,** శ్రీకృష్ణ - **యుధ్ర (హిందీ)**

గ్రామగ్రామాన తితిదే ధార్మిక కార్యక్రమాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తితిదే జిల్లా బాధ్యుడు డా.ఉత్తరపల్లి రామాచారి తదితరులు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : తితిదే, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలను విస్తరించనున్నట్లు తితిదే కార్యక్రమ ఉమ్మడి జిల్లా అధికారి డా. ఉత్తరపల్లి రామాచారి తెలిపారు. బుధవారం మహబూబ్‌నగర్ పట్టణం తితిదే కల్యాణ మండపంలో శ్రీవారి సేవకులతో సమావేశమయ్యారు. రామాచారి మాట్లాడుతూ.. ధర్మప్రచార కార్యక్రమాలను ప్రతి నెలలో కూడా ఒక్కో గ్రామంలో రెండు, మూడు రోజుల పాటు ధార్మిక ఉపన్యాసాలు, కుంకుమార్చన, భజనలు, ధర్మ ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. అక్టోబరు 1 నుంచి 5వ తేదీ వరకు షాద్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ధార్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అక్టోబరు 8 నుంచి 12వ తేదీ వరకు రాజాపూర్ మండలం చెన్నవెల్లి గ్రామంలో, మక్తల్ మండలం కర్నె గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో, 22 నుంచి 26వ తేదీ వరకు చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గ్రామంలో, 29 నుంచి 31వ తేదీ వరకు ఊర్కొండ మండలం నర్సంపల్లిలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం ధర్మప్రచార కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. శ్రీవారి సేవకులు నర్సింహులు, సత్యనారాయణగుప్తా, బి. ఆంజనేయులు, పి. బుచ్చయ్య, బి. వెంకటయ్య, ఎ. కురుమయ్య, రామాంజనేయులు, పి. చెన్నయ్య పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఆర్థిక ప్రయోజనాలు సత్వరం అందించాలని ఆల్ మైనార్టీ ఉద్యోగ, కార్మిక సంక్షేమ సంఘం (ఆల్‌మేవా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వహీద్‌షా ఎమ్మెల్సీ కోదండరాంకు ఇచ్చిన వినతిలో పేర్కొన్నారు. నాలుగు డీఏలు, 51శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ, క్యాష్‌లెస్ హెల్త్‌కార్డు, పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. డా. ఫరీద్, సలహాదారు యూసుఫ్ బిన్ నాసర్ పాల్గొన్నారు.

హాకీ సంఘం జిల్లా అధ్యక్షుడి మృతికి సంతాపం

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హాకీ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, భూత్పూరు మండలం తాటిపర్తి జడ్పీహెచ్‌ఎస్ వ్యాయామ ఉపాధ్యాయుడు గోటూరు శ్రీనివాసులుగౌడ్(58) బుధవారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ కన్నుమూశారు. భార్య, కుమారుడు ఉన్నారు. అంత్యక్రియలు స్వగ్రామమైన ధన్వాడ మండలం గోటూరులో నిర్వహించారు. ఈయన మృతిపై వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు జగన్ మోహన్‌గౌడ్, వేణుగోపాల్, వడెన్న, భాస్కర్‌రెడ్డి, రామేశ్వర్, నిరంజన్‌రావు, పరశురాం, రమేశ్ బాబు, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ సంతాపం ప్రకటించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : జమైతుల్ ఉలెమా-ఎ-హింద్ మహబూబ్‌నగర్ జిల్లా ఎన్నికలు బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఫ్తి మహమూద్ జుబేర్, ఏపీ ప్రతినిధి ఫసియుద్దీన్ నద్వి సమక్షంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నాసర్ మజాహిరి, ఉపాధ్యక్షులుగా నూరుద్దీన్, ముఫ్తి అబ్దుల్ ఖయ్యూం, ప్రధాన కార్యదర్శిగా హఫెజ్ గయాసుద్దీన్, కార్యదర్శిగా సుబూర్ ఖాన్ తదితరులను ఎన్నుకున్నారు.

డబ్బులు చెల్లించాలని తీర్పు

పాలమూరు, న్యూస్‌టుడే: మరణించిన మహిళ కుటుంబానికి డబ్బులు చెల్లించాలని వినియోగదారుల ఫోరం తీర్పు ఇచ్చిందని న్యాయవాది ఆడమ్స్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ మండలం కోటకదిరకు చెందిన చాకలి చిన్నమ్మ 2019 నుంచి ఎల్‌ఐసీకి ప్రీమియం చెల్లిస్తోంది. ఆమె 2020 జులైలో చనిపోయింది. కుమారుడు నాగరాజు ఎల్‌ఐసీ మేనేజర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆమెకు క్యాన్సర్ ఉందని, అందువల్ల బీమా వర్తించదని సంస్థ ప్రతినిధులు తెలిపారు. బాధితుడు జిల్లా వినియోగదారుల ఫోరాన్ని 2023లో ఆశ్రయించారు. మంగళవారం బాధితుడికి జిల్లా వినియోగదారుల ఫోరం 9 శాతం వడ్డీతో పాటు చెల్లించిన డబ్బులను ఇవ్వాలని ఆదేశించింది.

అభివృద్ధిలో ఫార్మాసిస్టులదే కీలకపాత్ర

పాలమూరు, న్యూస్‌టుడే: ఫార్మా పరిశ్రమ అభివృద్ధిలో ఫార్మాసిస్టులదే కీలకపాత్ర ఉంటుందని పీయూ రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం పాలమూరు విశ్వవిద్యాలయంలో ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యులు, ప్రజలకు ఫార్మాసిస్టులు అనుసంధానంగా ఉంటూ సమాజ సేవలో తమ వంతు సేవలను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమానికి ముందుగా విద్యార్థులు పీయూలో భారీ ప్రదర్శన చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డా. నూర్జహాన్, కోటేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, చిన్నాదేవి, రవికాంత్ పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

జడ్చర్ల, న్యూస్‌టుడే : తలసేమియా పిల్లల కోసం పోలేపల్లి ఫార్మా సెజ్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ వారు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, శిల్పా మెడికేర్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నటరాజ్, ఈశ్వర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

సాఫీగా నీరు పారేందుకు చర్యలు



ఖలీల్‌చౌక్ ప్రాంతంలో ఇళ్ల మధ్య పారుతున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, చిత్రంలో పుర కమిషనర్ తదితరులు

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: కొత్త చెరువు అలుగు నీరు మునుపటి మాదిరి వాగుగుండా సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నీటిపారుదల, పుర అధికారులకు సూచించారు. బుధవారం ఆయన కొత్త చెరువు అలుగు నీరు ముంచెత్తిన మడుగునగర్, ఖలీల్ చౌక్, నూర్‌ఖాన్ రైస్‌మిల్ పరిసరాలను పుర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అలుగు నీరు పారే వాగు ఆక్రమణలకు గురి కావడం వల్లే ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. అలుగు నీరు ముందుకు పారే పలు ప్రాంతాల్లో అడ్డంగా రహదారులు నిర్మించినందున అక్కడ త్వరలో వంతెనలు నిర్మించి నీరు కింది నుంచి పారేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి కొత్త చెరువును సందర్శించి చెరువు నీటికి గంగ పూజ నిర్వహించారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, వార్డు కౌన్సిలర్ మోయిన్‌అలీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, పురపాలక ఈఈ బస్వరాజ్, నీటి పారుదల శాఖ ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

వైద్య వృత్తిని పవిత్రమైన సేవగా పరిగణించాలి

పాలమూరు, న్యూస్‌టుడే: వైద్య వృత్తిని అత్యంత పవిత్రమైన సేవగా పరిగణించి పేదలు, ఇతర వర్గాలకు మేలు చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తిరుమలహిల్స్‌లో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలో 8వ ఎంబీబీఎస్ బ్యాచ్‌కు చెందిన వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పేదలు చెల్లించిన పన్నుల ద్వారానే మీరంతా వైద్య విద్యను అభ్యసించారని, వైద్యులుగా స్థిరపడిన తర్వాత పేదలకు విలువైన వైద్య సేవలు అందించాలన్నారు. మీ సమస్యలను ఎప్పటికప్పుడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు సమాచారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ రమేశ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సంపత్‌కుమార్‌సింగ్, ఆచార్యులు డా. రమాదేవి, ఏడీ శోభారాణి పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనలో స్వల్ప ఉద్రిక్తత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, న్యూస్‌టుడే : మండలంలోని ఉదండాపూర్ జలాశయాన్ని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులు పరిశీలించగా.. ఉదండాపూర్ నిర్వాసితులు వారిని అడ్డుకొని, నిరసన తెలిపే ప్రయత్నం చేశారు. జలాశయం పరిశీలన అనంతరం నిర్వాసితులతో సమావేశంలో మంత్రి ఉత్తమ్, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రసంగించి వెళ్తుండగా వేదిక వద్ద కిష్టారం, వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలకు చెందిన కొంతమంది అడ్డుపడే ప్రయత్నం చేశారు. ఎంపీ, స్థానిక ఎమ్మెల్యే నచ్చజెప్పి గ్రామస్థుల వినతులు స్వీకరించారు. అనంతరం మంత్రులు అక్కడి నుంచి వెళ్లారు. అంతకుముందు మంత్రులు మాట్లాడుతూ.. భూసేకరణ పరిహారం రూ.3.74కోట్లు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.2.63 కోట్లు, జలాశయంలో నిర్మాణాల కోసం రూ.13 కోట్ల నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. దీంతో పాటు నిర్వాసితుల అవార్డు రూ.532 కోట్లు కేటాయించాల్సి ఉండగా విడతల వారీగా పరిష్కరించాలని అధికారులను సూచించారు.

అక్రమార్కులను వదిలిపెట్టం : ఉదండాపూర్‌లో మంత్రుల పర్యటన అనంతరం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గతంలో అక్రమాలకు పాల్పడిన వారే నిరసనలు తెలిపారన్నారు. తాను జలాశయం పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. భూసేకరణలో ప్రభుత్వ భూములను ప్రైవేటు స్థలాలుగా చూపి భారాస నాయకులు పరిహారం పొందారని ఆరోపించారు. పునరావాసం, పరిహారం కింద లేని 300 మంది పేర్లను పొందుపరిచారన్నారు.

ఆసుపత్రిలోనూ శునకాల బెడదే!



శునకాల దాడులు పెరగటంతో వాటిని చూస్తేనే జనం వణికిపోతున్నారు. శునకాల దాడిలో గాయపడిన వారు ఆసుపత్రుల పాలవుతున్నారు. అలాంటి శునకాల గుంపు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని రేడియాలజీ హబ్ విభాగం మెట్లపై సేదతీరతుంటే రోగులు ఎంత కంగారు పడతారో ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. సిబ్బంది కూడా వాటిని తరమటం లేదు.

- ఈనాడు, మహబూబ్‌నగర్

రక్త పరీక్షలకు తాకిడి



వర్షాల నేపథ్యంలో వాతావరణంలోని మార్పులతో ప్రజలు తీవ్ర జ్వరాల బారిన పడుతున్నారు. చిన్నా, పెద్ద అని తేడాలేకుండా ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకునే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏ సమయంలో చూసినా రక్త పరీక్షల కేంద్రం వద్ద రోగుల రద్దీ కనిపిస్తోంది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

ప్రమాదకర నిర్లక్ష్యం!



మహబూబ్‌నగర్ పురపాలక కార్యాలయం ఎదురుగా రహదారి దెబ్బతిని చాలా రోజులవుతోంది. మరమ్మతుల కోసం 10 రోజుల కిందట పాత తారును తొలగించి, తొలగించిన వ్యర్థాలను అక్కడి నుంచి తరలించకుండా రోడ్డు పక్కనే కుప్పగా పోశారు. ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతూ, ప్రమాదాల బారిన పడుతున్నారు.

- ఈనాడు, మహబూబ్‌నగర్

దీన్‌దయాళ్ స్ఫూర్తితో లక్ష్యం అధిగమించాలి



మాట్లాడుతున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజి ఆచారి, చిత్రంలో శాంతికుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అందించిన స్ఫూర్తితో భాజపా సభ్యత్వాల లక్ష్యం అధిగమించేందుకు క్షేత్రస్థాయిలో పని చేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజి ఆచారి, భాజపా రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కురిహినిశెట్టి కాలనీలో బుధవారం నిర్వహించిన పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమంలో వారు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. భాజపా ఒక్క రాజకీయ పార్టీయే కాదని, గొప్ప మానవతావాద సిద్ధాంతాలు కలిగిన వ్యవస్థ అన్నారు. కొండయ్య, వీరబ్రహ్మాచారి, కె. రాములు, రాజేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు అంజయ్య, చెన్న వీరయ్య పాల్గొన్నారు.

- ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిన భాజపాకు పటిష్ఠంగా పునాదులు వేసిన మహనీయుడు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని భాజపా నేతలు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలరాజు, పద్మజారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులపై నిర్లక్ష్యం తగదు



ధర్నా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: పురపాలికల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంబించడం సరికాదని సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ధ్వజమెత్తారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఒప్పంద కార్మికులు నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. నిత్యం దుర్గంధంలో పనిచేస్తూ ప్రజలకు స్వచ్ఛతను అందిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు అలసత్వం వహిస్తున్నారని విమర్శించారు. కార్మికులను క్రమబద్ధీకరించడంతో పాటు నెలకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చంద్రకాంత్, ఎర్రనర్సింహులు, బాలరాజు, యాదయ్య, కృష్ణ, యాదమ్మ పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం!



మిడ్జిల్ మండలంలో విద్యుత్తు నియంత్రికలకు తీగ అల్లుకుని ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. తీగ వల్ల తరుచూ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. లాక్యాతండా పంచాయతీ పరిధిలోని పొలంలో నియంత్రిక చుట్టూ ప్రమాదకరంగా తీగ చిత్రమిది. దీనిపై 'న్యూస్‌టుడే' ఏఈ జ్ఞానసుందర్‌ను సంప్రదించగా స్పందిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటమన్నారు.

- న్యూస్‌టుడే, జడ్చర్ల న్యూటౌన్

అసంపూర్తి పనులతో అవస్థలు



గండీడ్ మండలంలోని జిన్నారం గేటు నుంచి జిన్నారం, చెల్మిల్లా గ్రామానికి రూర్బన్ పథకం నిధులు మూడేళ్ల క్రితం రూ.1.85 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినా ఇప్పటివరకు పూర్తిచేయలేదు. గ్రామానికి వెళ్లే దారిపై గుత్తేదారు కంకర వేసి వదిలిపెట్టారు. ద్విచక్రవాహనదారులు, కాలినడకన వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో రోడ్డుపై నరకం కనిపిస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి త్వరగా బీటీ రోడ్డును పూర్తి చేయాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గండీడ్

ఏడాదిగా నిలిచిన పనులు



బాలానగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా నిర్మాణం చేపట్టిన భోజనశాల అసంపూర్తిగా ఉంది. గుత్తేదారు ఏడాదిగా పనులు ఆపేశారు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని చెట్ల కింద, వరండాలో నేలపై కూర్చుని తింటున్నారు. ఎంఈవో వెంకటయ్యను వివరణ కోరగా.. గుత్తేదారుకు బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేశారని, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని కలిసి సమస్యను వివరిస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, బాలానగర్

పద్య రచన నైపుణ్యాలపై కార్యశాల

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఎంవీఎస్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం పద్య రచనపై కార్యశాల నిర్వహించారు. కార్యక్రమ ప్రారంభోత్సవంలో వక్తలుగా ప్రముఖ కవులు, రచయితలు పల్లెర్ల రామోహనరావు, మాడుగుల నాగఫణిశర్మ, డా. మఠపతి మాంతయ్య, అవుసుల భానుప్రకాశాచార్య విచ్చేసి మాట్లాడారు. పద్య వైభవం, విశిష్టతపై వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డా. పద్మావతి, వైస్ ప్రిన్సిపల్ డా. కృష్ణమూర్తి, తెలుగుశాఖ ఆచార్యులు డా. రాఘవేంద్ర, సుభాషిణి, డా. స్వరూప, డా. స్వప్న, గోవర్ధన్, మారెప్ప, జనార్దన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా యువజనోత్సవం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న యువజన క్రీడల అధికారి ఎస్. శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: సాంస్కృతిక ప్రదర్శనలతో రాష్ట్ర స్థాయికి ఎదగాలని యువజన క్రీడల అధికారి ఎస్. శ్రీనివాస్ ఆకాంక్షించారు. బుధవారం డీఎస్‌ఏ ఇండోర్ మైదానంలో జిల్లా స్థాయి సాంస్కృతిక యువజనోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. కళాకారులు తమలోని నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఇది మంచి వేదిక అన్నారు. ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయి సాంస్కృతిక యువజనోత్సవాలకు ఎంపిక చేస్తామన్నారు. రవీందర్‌రెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..: జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీల్లో జానపద నృత్యం స్వప్న బృందం (చంద్రముఖి కల్చరల్ అకాడమీ మ. నగర్), జానపద గీతాలు శ్రావణి బృందం(సరోజిని ఫార్మసీ కళాశాల మ. నగర్), జానపద నృత్యం సోలో నాగసాయి (చైతన్య పాఠశాల మ. నగర్), వ్యాసరచన నికిత (డైట్ కళాశాల మ. నగర్), చిత్రలేఖనం అస్రా తబస్సుం (డైట్ కళాశాల మ. నగర్), ఉపన్యాసం షబానా బేగం (ఎన్టీఆర్ మహిళా కళాశాల మ. నగర్), సైన్స్ (శ్లోక పాఠశాల జడ్చర్ల), యువ క్రితి (జడ్పీహెచ్‌ఎస్ ఎదిర) విజేతలుగా నిలిచారు.

అంబులెన్సులో మహిళ ప్రసవం

పాలమూరు, న్యూస్‌టుడే: పురిటి నొప్పులతో బాధ పడుతున్న ఓ గర్భిణీని తరలిస్తుండగా అంబులెన్సులో ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది కథనం మేరకు.. బుధవారం ఉదయం మహబూబ్‌నగర్ మండలంలోని ఫత్తేపూర్ గ్రామానికి చెందిన వారు 108కు కాల్ చేశారు. షాహీనా బేగంను అంబులెన్స్‌లో తీసుకుని మహబూబ్‌నగర్‌కు వస్తుండగా, మార్గంమధ్యలో తీవ్రంగా నొప్పులు రావడంతో వాహనాన్ని నిలిపి అక్కడే ఆమెకు కాన్పు చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, 108 సిబ్బంది అత్యవసర వైద్య విభాగ నిపుణుడు రాజు, పైలట్ కృష్ణయ్య 'న్యూస్‌టుడే'కు వివరించారు. మూడో కాన్పులో ఆమెకు మగబిడ్డ జన్మించాడని, వారిద్దరినీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

ఘనంగా ఏబీ బర్దన్ శత జయంతి

మహబూబ్‌నగర్ పట్టణం: భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్ శత జయంతి వేడుకలను సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఏఐఎస్‌ఎఫ్‌లో కీలకపాత్ర పోషిస్తూ విద్యార్థి నాయకుడి నుంచి జాతీయ నాయకుడిగా ఎదిగారన్నారు. రాము, సురేశ్, చాంద్‌భాషా, శంకర్‌నాయక్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సరోజినీ రాములమ్మ ఫార్మసీ కళాశాలలో..



కళాశాలలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఛైర్మన్ డా. బాలరాజు

పాలమూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సరోజినీ రాములమ్మ ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మసీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని కళాశాల ఛైర్మన్ బాలరాజు ప్రారంభించి మాట్లాడారు. మనిషి ఆరోగ్యంగా మనుగడ సాగించాలంటే తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ శిరీష, కార్యదర్శి పద్మలత, ప్రిన్సిపల్ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు కేంద్రం ఎదుట నిరసన

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే : మూడురోజులుగా విద్యుత్తు లేక చీకట్లో మగ్గుతున్నామని మండలంలోని ముందలితండా వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాగు చేయించిన నియంత్రికను బిగించేందుకు సిబ్బంది రాకపోవడంతో బుధవారం రాత్రి మండల కేంద్రంలోని విద్యుత్తు ఉపకేంద్రం వద్దకు తీసుకువచ్చారు. ఏ సమస్య వచ్చినా సిబ్బంది సకాలంలో స్పందించరన్నారు. విషయమై 'న్యూస్‌టుడే' ఏఈ సత్యంను చరవాణి ద్వారా సంప్రదించగా స్పందించలేదు.

రేషన్ డీలరుపై ఫిర్యాదు

మిడ్జిల్: సరుకుల పంపిణీలో రేషన్ డీలరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వెలుగోముల గ్రామస్థులు తహసీల్దార్ రాజుకు బుధవారం ఫిర్యాదు చేశారు. స్థానికంగా ఉండకుండా సకాలంలో సరుకులు ఇవ్వడంలేదని, అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. బాబా, బాల్‌రెడ్డి, బాలస్వామిగౌడ్ ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల మెరుగుకు కృషి

నవాబుపేట : ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు వందశాతం నేర్చుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ ప్రతినిధి భూపతిసింగ్ అన్నారు. బుధవారం నూతనంగా ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన నాగ్యానాయక్‌ను సన్మానించి మాట్లాడారు. రమాకాంత్, నసీర్ అహ్మద్ పాల్గొన్నారు.

మూసాపేట ఎమ్మార్వోగా రాజునాయక్

అడ్డాకుల, న్యూస్‌టుడే : మూసాపేట తహసీల్దార్‌గా రాజునాయక్ బాధ్యతలు చేపట్టారు. మిడ్జిల్ నుంచి ఆయన ఇక్కడకు రాగా ఇక్కడ పనిచేసిన బ్రహ్మంగౌడ్ జడ్చర్లకు వెళ్లారు.

రహదారి ప్రమాదంలో మహిళ మృతి.. భూత్పూర్, న్యూస్‌టుడే : భూత్పూర్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రహదారి ప్రమాదంలో మహిళ మృతిచెందారు. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం మాసుపల్లికి చెందిన లక్ష్మి(29) కొంతకాలం నుంచి పుట్టింట్లో ఉంటోంది. మూడు రోజుల కిందట ఇంట్లో నుంచి బయటకు వచ్చిన ఆమె కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెదికారు. భూత్పూర్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందినట్లు సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు.. దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. చిన్నచింతకుంట మండలం దాసర్‌పల్లి గ్రామానికి చెందిన హరిజన్ లక్ష్మన్న(53) పంచాయతీ కార్మికుడు. బుధవారం పొలంలో ఉన్న నియంత్రిక వద్ద మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతంతో అక్కడిక్కడికే మృతి చెందారు. కుమారుడు కురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

టిప్పర్ ఢీకొనడంతో వృద్ధుడి దుర్మరణం.. మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ పట్టణంలోని హనుమాన్‌పురకు చెందిన బోయ చంద్రన్న(75) తన పెద్ద కుమార్తె మాచన్‌పల్లిలో ఉంటుంది. ఆమె వద్దకు వెళ్లడానికి బుధవారం ఉదయం బస్సులో బయలుదేరి కోడూరు స్టేజీ వద్ద దిగాడు. అక్కడ నుంచి రహదారి దాటుతున్న సమయంలో మహబూబ్‌నగర్ నుంచి దేవరకద్రకు వెళ్తున్న టిప్పర్ వేగంగా వచ్చి అతన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయాడు. సమాచారం అందుకున్న గ్రామీణా ఠాణా పోలీసులు మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.



చంద్రన్న

గల్లంతైన కార్మికుడి మృతదేహం గుర్తింపు.. జడ్చర్ల, న్యూస్‌టుడే : చెరువులో పడి గల్లంతైన పంచాయతీ కార్మికుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల మండలం గోప్లాపూర్ గ్రామానికి చెందిన తోకల జంగయ్య(65) సోమవారం సాయంత్రం గ్రామ పెద్దచెరువులో మునిగి గల్లంతయ్యారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు శ్రమించి మృతదేహాన్ని వెలికితీశారు.

మూడు దుకాణాల్లో చోరీ.. బాలానగర్, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో మూడు దుకాణాల్లో చోరీ జరిగింది. ఎస్సై తిరుపాజీ కథనం ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున కిరాణం, ఆటో మొబైల్, ఎలక్ట్రికల్ దుకాణాల షెట్టర్ల తాళాలు పగులగొట్టి రూ.9700 చోరీ చేశారు. వెలిముద్రలు తీసుకున్నట్లు, ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ఆసుపత్రి నుంచి తప్పిపోయిన మహిళ.. మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన ఓ మహిళ తప్పిపోయిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామీణా ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లికి చెందిన ఓ మహిళ(42) అనారోగ్య కారణాల వల్ల ఈ నెల 22వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఓ ఆసుపత్రిలో చేరింది. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం ఆసుపత్రిలో కనిపించలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు.. బాలానగర్, న్యూస్‌టుడే : ఓ తండాకు చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై మండలకేంద్రం నుంచి వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి కిందపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను మండల కేంద్రంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ అయిన **శ్రీమతి గోర మంజుల, భర్త: గోర మల్లేష్ గౌడ్,** నివాసము. ఇ.నెం.18-204/13/జి/4/1, ఈశ్వర్ కాలనీ, షాద్‌నగర్. అను నా క్లయింట్ కల్లెపల్లి గ్రామములో, రాజాపూర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లాలో భూమి సర్వే నెం.136/ఉ3, విస్తీర్ణం: 2-35 గుంటలు, కొనటానికి నిశ్చయించుకొని ప్రస్తుత పట్టాదారు అయిన **శ్రీ లక్కపోపు మధుసూధన్ తండ్రి చంద్రయ్య,** కల్లెపల్లి గ్రామము, రాజాపూర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా ప్రస్తుత భూమి పట్టాదారు అయిన వీరితో నా క్లయింట్ అమ్మకము ఒప్పందం తేది: 18-07-2024 రోజున ఇరువురు ఒప్పందం కుదుర్చుకున్నారు. మొత్తం అమ్మకపు రుసుములో కొంత అడ్వాన్సుగా పట్టాదారుకు చెల్లించడం జరిగినది.

ఇట్టి భూమిపై సమస్త ప్రజలలో ఎవరికైనా ఎలాంటి భూతగాదాలు మరియు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నచో తగు ధృవపత్రాలతో ఈ క్రింది చిరునామాకు సంప్రదించగలరు. ఇట్టి ప్రకటన వెలువడిన 7 రోజులలో ఎలాంటి అభ్యంతరాలు రానిచో నా క్లయింట్ పై భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరుగుతుంది.

భూమి వివరాలు:-

సర్వే నెం.136/ఉ3, విస్తీర్ణం: 2-35 గుంటలుకు హద్దులు తూర్పు: 33 ఫీట్ల రోడ్డు మరియు నక్క బాట, **పడమర:** బి.శ్రీనివాస్ ల్యాండ్, **ఉత్తరం:** లక్కపోగు బాలయ్య మరియు ఇతరులు, **దక్షిణం:** బి.శ్రీనివాస్ ల్యాండ్.

సంప్రదించవలసిన చిరునామా:
సం/- **మంచిరేవుల రాందాస్**
సీనియర్ న్యాయవాది, షాద్‌నగర్,
సెల్: 9849815622

(c) eenadu